ప్రభుత్వ కాలేజీపై ప్రైవేటు నీడ

- సిబ్బంది, సౌకర్యాలున్నా.. విద్యార్థులు నిల్
- ప్రైవేట్ కళాశాలలకు సిఫారసు చేస్తున్న స్కూలు ఉపాధ్యాయులు
- హైస్కూల్ ఆవరణలోనే ఉన్నా.. చేరని స్టూడెంట్స్



గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల


నాడు-నేడులో సమకూర్చిన బెంచీలు, కుర్చీలు


కళాశాలకు చేరిన పాఠ్య పుస్తకాలు

గోపాలపురం: మండల కేంద్రమైన గోపాలపురంలో 2018లో ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు కరవయ్యారు. గోపాలపురం అవుతు రామిరెడ్డి, ముప్పిడి సుబ్బారెడ్డి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ జూనియర్ కళాశాలలో ఎనిమిదేళ్లుగా ఇంటర్మీడియెట్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు విద్యను అభ్యసించారు. ఈ ఏడాది సెకండియర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీ కాలేజీలకు వెళ్లిపోగా, ప్రస్తుతం సెకండియర్ విద్యార్థులు 39 మంది ఉన్నారు. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 120 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఏ ఒక్కరూ కూడా ఇదే పాఠశాల ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాలలో మాత్రం జాయిన్ కాలేదు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు బృహత్తర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవసరమైన బెంచీలు, కుర్చీలు, ఫ్యాన్లు, యూనిఫాం, ఉచిత అడ్మిషన్ సదుపాయాలు కల్పించారు.

ప్రైవేట్‌కు సిఫారసు

గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరకుండా, ఆ పాఠశాల ఉపాధ్యాయులు కొంతమంది అడ్డుపడుతున్నారు. ప్రభుత్వ కళాశాలకు వద్దని, ప్రైవేట్ కళాశాలలో విద్యాబోధన బాగుంటుందని చెప్పి విద్యార్థులను అక్కడకు పంపిస్తున్నట్టు చెప్పుకొంటున్నారు. ఒక్కో విద్యార్థికి ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకూ.. విద్యార్థులను సిఫారసు చేసిన ఉపాధ్యాయులకు ముట్టజెబుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులే ఎక్కువ అని తెలిసినా, ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్ కళాశాలలకు సిఫారసు చేసి విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక బారం మోపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ విద్యా శాఖాధికారులు స్పందించి, పాఠశాలలో టెన్త్ చదివిన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మాయమాటలు చెప్పి వారిని తప్పుదోవ పట్టించే ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **తల్లిదండ్రులు దృష్టి సారించాలి**
>
> హైస్కూల్ విద్యార్థులు 120 మంది ఉత్తీర్ణత సాధించారు. హాల్ టికెట్లు తీసుకున్నారు. కానీ ఒక్కరు కూడా దగ్గర్లో ఉన్న జూనియర్ కళాశాలలో జాయిన్ కాలేదు. ప్రైవేట్ కళాశాలలపై మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలలో చదువుకునేలా దృష్టి సారించాల్సి ఉంది.
>
> – ఎస్‌కే రఫీ అహ్మద్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

క్లుప్తంగా

5న లోక్ అదాలత్

తాళ్లపూడి(కొవ్వూరు): వచ్చే నెల ఐదో తేదీన జరిగే లోక్ అలదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. కొవ్వూరు కోర్ట్ హాల్‌లో సోమవారం శ్రీరామ్ ఫైనాన్స్ న్యాయవాదులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలని న్యాయవాదులు కోర్టుకు సహకరించాలని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా దుర్గామహేశ్వరరావు


దుర్గా మహేశ్వరరావును అభినందిస్తున్న సిబ్బంది

ఉండ్రాజవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ పి.దుర్గామహేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తణుకు ప్రభుత్వ ఆసుపత్రి పీపీ యూనిట్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు సేవలందించిన ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ పెరవలి పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన దుర్గా మహేశ్వరరావును పీహెచ్‌సీ–2 డాక్టర్ ఉషాదేవి, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు 'తలారి' పరామర్శ


కొఠారు రత్నావతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని తాడిపూడి, గజ్జరం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు సోమవారం పరామిర్శించారు. ఈ సందర్భంగా గజ్జరం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు గన్నిన రత్నాజీ సోదరి కొఠారు రత్నావతి ఇటీవల మృతి చెందడంతో పరామర్శించారు. అదేవిధంగా తాడిపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు గిద్దా మధు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సర్పంచ్ గండి రాంబాబు, గుంటు చిన్నబ్బాయి, గూడా విజయరాజు, చిక్కాల మహేష్, పిట్టా శ్రీనివాస్, గిద్దా రాంబాబు, నామా ప్రకాశం, మండిగ గిరి తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ఉండ్రాజవరం: విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని తాడిపర్రు సర్పంచ్ కె.నరేంద్ర సూచించారు. తాడిపర్రు ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా వంటకాలను రుచిచూశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారుల ధ్వంసం


దేవరపల్లి-దుద్దుకూరు మధ్య ప్రధాన రహదారిపై దమ్ము చక్రాలతో వెళుతున్న ట్రాక్టర్

దేవరపల్లి: దమ్ము ట్రాక్టర్లు రహదారులను ధ్వంసం చేస్తున్నాయి. ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభం కావడంతో దమ్ము చేయడానికి పొలాలకు వెళుతున్న ట్రాక్టర్లు రహదారిపై ఇనుప చక్రాలతో వెళ్లడంతో రహదారులు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై వెళ్లకూడదనే నిబంధనలు ఉన్నప్పటి ఎవరూ పట్టించడంలేదని చెబుతున్నారు. దమ్ము ట్రాక్టర్లను రోడ్లపై వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'మీ కోసం'కు అధికారులందరూ హాజరుకావాలి

- సత్వరమే సమస్యలను పరిష్కరించాలి
- కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత


కొవ్వూరు మీ కోసం కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): మీ కోసం కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ‹పీజీఆర్ఎస్ మీ కోసం› వేదికలో వచ్చిన అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణిసుస్మిత మాట్లాడుతూ 10 వినతులు వచ్చాయని తెలిపారు. వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారి, డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన కరటూరి దేవానంద్ చెరువుల నుంచి నీరు రోడ్డుపైకి వస్తోందని తూరలు ఏర్పాటు చేయాలని కోరారు. అచ్చాయమ్మ కాలనీకి చెందిన పి.రామలక్ష్మి మూడు చక్రాల వాహనం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు

దేవరపల్లి: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. మండలంలోని ఆర్ కన్వెన్షన్ హాల్లో వేడుకలు జరగనున్నాయి. ఇక్కడ రక్తదాన శిబిరాన్ని ఉదయం 9 గంటలకు మాజీ మంత్రి తానేటి వనిత ప్రారంభిస్తారని, సాయంత్రం 6 గంటలకు కృష్ణంపాలెంలోని డాక్టర్ బీర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వయోవృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు అన్నదానం, దుస్తుల పంపిణీ చేస్తారని తెలిపారు.

వృద్ధులకు 26 నుంచి ఇంటింటికీ రేషన్


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

దేవరపల్లి: ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండలంలోని 65 సంవత్సరాలు దాటిని వయోవృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచాన ఉన్న వారికి ఇంటింటా రేషన్ పంపిణీకి డీలర్లు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 3,270 వయోవృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచంపై ఉన్న కార్డుదారులు ఉన్నట్టు ఆయన తెలిపారు. జులైకు సంబంధించిన రేషన్ ఈ నెల 26వ తేదీ నుంచి పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జూన్‌లో 89 శాతం రేషన్ పంపిణీ చేశారని, జులైలో ఇతర మండలాల కంటె ముందంజలో ఉండాలని ఆయన సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, దుకాణం పరిశుభ్రంగా ఉండాలని ఆయన తెలిపారు. మండలంలో 34 రేషన్ దుకాణాల ద్వారా సుమారు 25 వేల కుటుంబాలకు రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్డుకు అర కిలో పంచదార, సభ్యుడికి ఐదు కిలోల బియ్యం అందజేస్తున్నట్టు ఆయన వివరించారు. దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ బోర్డు, ధరల పట్టిక, స్టాక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. రేషన్ సరుకుల పంపిణీలో ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని, కార్డు దారులతో మర్యాదగా మాట్లాడాలని ఆయన తెలిపారు. వయోవృద్ధులకు, దివ్యాగులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నూరు శాతం పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్లి రేషన్ అందజేయాలని ఆయన తెలిపారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఎ.సత్యనారాయణ, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం తరలిన వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు


కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నిడదవోలు మండల యూత్ నాయకులు

నిడదవోలు రూరల్: రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరు నిరసన కార్యక్రమానికి నిడదవోలు మండలంలోని వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు సోమవారం బైక్‌లపై తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు, నాయకులు పాతాల ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్, 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్లకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్. నారాయణ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అచ్చయపాలెం, బుచ్చియపాలెం, కొత్తగూడెం, ధుమంతునిగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు విద్యుత్ కు అంతరాయం ఉంటుందని తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోరాటం ప్రేరణాత్మకం


ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పిస్తున్న బీజేపీ నాయకులు

నిడదవోలు: భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడే దిశగా డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోరాటం ప్రతి భారతీయుడికి ప్రేరణాత్మకమని పట్టణ బీజేపీ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్ అన్నారు. పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో జన్‌సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి టంగుటూరి శ్రీను, ఉపాధ్యక్షుడు చామంతి భీమేశ్వరరావు, రంగా వెంకటేశ్వరరావు, కట్టంగ అచ్చయ్య, నీలం రామారావు, కొత్తలంక భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ విధుల నుంచి మినహాయించాలి

ఎంపీడీఓకు అంగన్‌వాడీ వర్కర్ల వినతి


దేవరపల్లి ఎంపీడీఓ రాజారావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

దేవరపల్లి: సామాజిక పింఛన్ల పంపిణీ విధుల నుంచి తమను మినహాయించాలని మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల నాయకురాలు టీపీ లక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వార్కర్లకు పింఛన్ల పంపిణీ విధులు అప్పగించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. మొబైల్‌లో యాప్ సక్రమంగా పనిచేయడంలేదని, దీంతో పింఛన్ల పంపిణీ ఆలస్యమవుతుందన్నారు. ఇప్పటికే పని భారం అధికంగా ఉందని, పింఛన్ల పంపిణీ అదనపు భారంగా మారిందని వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. నిరసన కార్యక్రమం అనంతరం స్థానిక ఎంపీడీఓ రాజారావుకు వినతిపత్రం అందజేశారు. వి.కుమారి, పి.పద్మ కామేశ్వరి, కె.సులోచన, ఎం.అనురాధ, ఉండపల్లి మంగతాయారు, కె.భవాని, పి.నాగేశ్వరి పాల్గొన్నారు.

నల్లజర్లలో..

అంగన్‌వాడీ వర్కర్లకు పనిభారం తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ నల్లజర్ల మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సోమ వారం స్థానిక మండల పరిషత్ కార్యాయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. మండల అంగన్‌వాడీ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు విమలాభాయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


చిక్కాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న సిబ్బంది

వాగల్లు: చిక్కాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ సీడీపీవో నాగలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లు పూర్తయిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డేతో పాటు, మూడేళ్లు పూర్తయిన పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా చిక్కాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రీస్కూల్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ కొయ్యమణి, జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణ, సెక్టార్ సూపర్‌వైజర్ పీవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు


తాళ్లపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నిడదవోలు రూరల్: నిడదవోలు ఆర్వోబీ నిర్మాణ పనులు దృష్ట్యా అధికారులు భారీ వాహనాలను దారి మళ్లించారు. అయితే నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లేందుకు సింగవరం మీదుగా తాళ్లపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద నుంచి వాహనాలు వెళుతున్నాయి. అయితే ఈ దారిలో భారీ వాహనాలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నాయి. బైక్‌లు, కార్లు వెళ్లేందుకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ లారీలు కూడా వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. తాళ్లపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద వర్షంతో పెద్దపెద్ద గోతులు కూడా ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి భారీ వాహనాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ

నిడదవోలు: పట్టణంలోని డీఎస్‌ఓ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు నిడదవోలు జనసేన పార్టీ ఆధ్వర్యంలో బ్రాస్, స్టీల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయంతో స్టీల్ ప్లేట్లు సోమవారం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫాం అందజేశారు.